



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శనివారం
11-10-2025
పేజీలు: 02



# ఎస్వీ యూనివర్సిటీలో మళ్లీ చిరుత కలకలం

తిరుపతి ఎస్వీ యూనివర్శిటిలో మరోసారి చిరుతల కలకలం. గత రాత్రి ఎంప్లాయిస్ క్వార్టర్స్ సమీపంలోకి వచ్చిన చిరుత. సీసీ కెమెరాలో రికార్డైన చిరుత సంచరిస్తున్న దృశ్యాలు.వెటర్నరీ, వేదిక్, ఎస్వీ యునివర్సిటీలో చిరుతలను పట్టేందుంకు ఇప్పటికే ఐదు బోన్లు ఏర్పాటు చేసిన అటవీ శాఖ అధికారులు, రాత్రిపూట విద్యార్థులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచన, విద్యార్థులు రాత్రిపూట బయటకు రావద్దని అధికారుల హెచ్చరిక.



# రిలయన్స్ పవర్ ప్రతినిధిని అరెస్టు చేసిన ఈడీ

వ్యాపారవేత్త అనిల్ అంబానీకి చెందిన రియలన్స్ గ్రూపు ప్రతినిధిని అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం వెల్లడించింది. మనీల్యాండరింగ్ చట్టం కింద అరెస్టు చేశారు. రిలయన్స్ పవర్ సంస్థలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అశోక్ పాల్‌ను ఈడీ కస్టడీలోకి తీసుకున్నది. పీఎంఎల్ఏ కింద కేసు ఫైల్ చేశారు. బ్యాంకులకు కోట్లు ఎగవేసిన కేసులో అనిల్ అంబానీకి చెందిన కంపెనీలపై ఈడీ దర్యాప్తు చేపడుతున్నది. ఫేక్ బ్యాంక్ గ్యారెంటీ కేసులో అతన్నిఢిల్లీ ఆఫీసుకు తీసుకెళ్లారు. ఇవాళ ఉదయం 9.30 గంటలకు ఆయన్ను జడ్జీ ముందు ప్రవేశపెట్టనున్నారు. ఏడీఏ గ్రూపు కేసులో పాల్‌ను అరెస్టు చేశారు. యెస్ బ్యాంకుతో లింకున్న ఆర్థిక నేరాభియోగాలు నమోదు అయ్యాయి. ఏడీఏ గ్రూపుకు గతంలో అనిల్ అంబానీ నేతృత్వం వహించారు. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూపు సుమారు 17 వేల కోట్ల ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తున్నది. 2017 నుంచి 2019 మధ్య కాలంలో యెస్ బ్యాంకు నుంచి మూడు వేల కోట్లు రుణం తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.




# పొంగులేటి Vs కొండా సురేఖ

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యల దుమారం సమసిపోక ముందే మరో జిల్లాలో మంత్రుల మధ్య విభేదాలు పొడచూపాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధిపత్య తీరుపై అదే జిల్లా మంత్రులు ఆగ్రహంతో రగిలిపోతున్నారని విశ్వసనీయ సమాచారం. ఏకంగా కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారని తెలిసింది. రేవంత్ సర్కార్‌కు ఉమ్మడి కరీంనగర్ సెగ చల్లారక ముందే మరో జిల్లా పొగ రాజుకోవడం తలనొప్పిగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అదే జిల్లాకు చెందిన ఇద్దరు మహిళా మంత్రులపై చెలాయించే ఆధిపత్యం తాజాగా పరాకాష్ఠకు చేరిందని తెలుస్తున్నది. దీనికి మేడారం కేంద్రంగా జరిగే పనులే కేంద్ర బిందువుగా మారాయి. మహిళా మంత్రులైన సీతక్క, కొండా సురేఖ 'ఉత్త' నిమిత్త మాత్రులేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తేల్చారా? అని జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారింది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే మేడారం మహాజాతర నేపథ్యంగా జరిగే పనుల విషయంలో మంత్రి పొంగులేటి 'ఇటేటు రమ్మంటే ఇల్లంత నాదే' అన్న చందంగా వ్యవహరిస్తున్నారని మహిళా మంత్రులిద్దరూ రగిలిపోతున్నట్టు సమాచారం. ఇప్పటికే వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఏ ఇద్దరినీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలువనీయకుండా తన ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పొంగులేటి ఆధిపత్యంపై మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. బహిరంగంగానే మంత్రి పొంగులేటి వ్యవహారంపై పలు సందర్భాల్లో ఆయన వ్యాఖ్యానించిన దాఖలాలూ ఉన్నాయి. మేడారం సమ్మక్క-సారలమ్మ గద్దెల నవనిర్మాణం కోసం రూ.71 కోట్ల టెండర్లను ప్రభుత్వం పిలిచింది. దేవాదాయ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే, ఆదివాసీ బిడ్డ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి అయిన సీతక్కకు కనీస సమాచారం లేకుండానే టెండర్ల ప్రక్రియ పూర్తి అయిందనే చర్చ సాగుతున్నది. గతనెల 23న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు మేడారం సందర్శించారు. ఆ సమయంలో మేడారంలో చేపట్టనున్న పనులను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న పొంగులేటి వారానికి ఒకసారి అయినా సమీక్షించాలని సీఎం ఆ సందర్భంగా చెప్పారు. ఆ సమయంలోనే జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు సీతక్క, సురేఖ షాక్‌కు గురయ్యారని, దీనికితోడు అదే సభలో సంబంధిత మంత్రి కొండా సురేఖకు కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అవమాన పరిచారనే ఆరోపణలు వినిపించాయి. బీసీ సామాజికవర్గం, మహిళా మంత్రి అయిన కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న దేవాదాయ శాఖలో మంత్రి పొంగులేటి పెత్తనం ఏమిటి? అని ఆమెతో సహా పలువురు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. తన మంత్రిత్వ శాఖలో తనకు తెలియకుండా టెండర్లు పిలవడం ఎంతవరకు న్యాయమని, ఈ విషయంలో ఆమె అధిష్ఠానానికి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్టు ఆమె సన్నిహిత వర్గాల ద్వారా తెలిసింది. మాటిమాటికీ ఆడబిడ్డలు అంటూ తమను సంబోధిస్తూనే తమపైనే ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారని ఆమె తన సన్నిహితులతో వాపోయినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. మేడారం పనులకు టెండర్లు పిలవడం, 'ముఖ్య'నేత ప్రధాన సలహామండలి బాధ్యులు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే వ్యాపార భాగస్వామిగా ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన సంస్థకు కేటాయించడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణించిన ఆ మంత్రి అన్ని విషయాలను అధిష్టానం 'నోటీస్'కు చేరవేసే పనిలో నిమగ్నమైనట్టు తెలుస్తున్నది.



మచిలీపట్నం పీఎస్ ఘటనపై ఎస్పీ సీరియస్..

# పేర్నినానిపై కేసు నమోదు

మాజీ మంత్రి పేర్నినానిపై కేసు నమోదు అయ్యింది. ఆర్ పేట సీఐ యేసుబాబుపై నిన్న (శుక్రవారం) పేర్ని నాని, వైసీపీ నేతలు దౌర్జన్యం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మాజీ మంత్రితో పాటు మరో 29 మందిపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. మచిలీపట్నం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకున్న ఘటనపై ఎస్పీ సీరియస్ అయ్యారు. సీఐ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాదా గిరి దిగారు పేర్నినాని. గతంలో మచిలీపట్నం మెడికల్ కాలేజీ వద్ద నిరసనకు వైసీపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఆ నిరసనకు వెళ్తున్న వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేని నిరసనకు వెళ్తున్నారంటూ వైసీపీ నేతలపై కేసులు నమోదు చేశారు.



# ఏనుగు vs ఖడ్గమృగం

ఈ భూమి మీద అత్యంత బలమైన జంతువు ఏనుగు. అత్యంత భారీ శరీరం, బలం కలిగిన ఏనుగులు సాధారణంగా సాధు జంతువులు. అనవసరంగా ఇతర జంతువుల జోలికి వెళ్లవు. పెద్ద మనిషి తరహాలో వ్యవహరిస్తుంటాయి. అయితే ఏదైనా జంతువు తమ జోలికి వస్తే మాత్రం తగిన గుణపాఠం చెబుతాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో ఓ ఖడ్గ మృగం, ఏనుగు తలపడ్డాయి. @Mothematiks అనే ఎక్స్ యూజర్ ఈ వీడియోను షేర్ చేశారు. వైరల్ అవుతున్న ఆ వీడియో ప్రకారం.. అడవిలో ఓ భారీ ఏనుగు, ఖడ్గమృగం ఒకదానితో ఒకటి తలపడ్డాయి. ఏనుగు శరలీంతో పోల్చుకుంటే ఖడ్గమృగం దాదాపు సగం మాత్రమే ఉంది. అయినా ఆ ఖడ్గమృగం ధైర్యంగా పోరాడుతోంది. ఏనుగు ఆ రైనోను తన తొండంతో నెడుతూ వెనక్కి తోసుకెళ్లిపోయింది. ఆ రైనో తన కొమ్ములతో పొడుస్తూ ఏనుగును నిలువరించడానికి ప్రయత్నిస్తోంది. పక్కనే మరికొన్ని ఏనుగులు కూడా ఉన్నాయి. అయినా రైనో తన పోరాటాన్ని ఆపలేదు.

# డ్రాగన్ దేశంపై వంద శాతం సుంకాలు విధించిన ట్రంప్




మొన్నటివరకు సుంకాల పేరుతో భారత్‌పై వాణిజ్య యుద్ధానికి దిగిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా చైనాను కూడా టార్గెట్ చేసుకున్నారు. తాజాగా మరోసారి సుంకాల బాంబు పేల్చారు. చైనా దిగుమతులపై అదనంగా వంద శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ టారిఫ్‌లు నవంబర్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రాబోతున్నాయి. ఇప్పటికే చైనాపై 30 శాతం పన్నులు అమల్లో ఉన్న విషయం తెలిసిందే. అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా పలు ఆంక్షలు విధించడం ట్రంప్ ఆగ్రహానికి కారణం. అందుకు ప్రతిగానే చైనాపై టారిఫ్ వార్‌కు తెర తీశారు. అక్టోబర్ చివర్లో జరిగే ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార శిఖరాగ్ర సమావేశంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలిసి చర్చలు జరపాలని ట్రంప్ భావించారు. తాజా పరిణామాల నేపథ్యంలో, జిన్‌పింగ్‌తో చర్చలు చేయడంలో అర్థం లేదని ట్రంప్ తాజాగా వ్యాఖ్యానించారు. కాగా, అమెరికా టారిఫ్‌లపై చైనా ఇంకా స్పందించలేదు. ఈ టారిఫ్‌లకు ప్రతిగా చైనా దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటే ఈ నెల నుంచి టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని ట్రంప్ హెచ్చరించారు. 'చైనాలో విచిత్రమైన విషయాలు చోటు చేసుకుంటున్నాయి. అరుదైన ఖనిజాలపై పలు ఆంక్షలు విధించాలనుకుంటున్నారు. దీనిపై ప్రపంచం మొత్తానికి లేఖలు పంపుతున్నారు. చైనా నిర్ణయం మినహాయింపు లేకుండా అన్ని దేశాలను ప్రభావితం చేస్తుంది. చైనాతో మేం కొంతకాలంగా మంచి సంబంధాలే కొనసాగిస్తున్నాం. అయినప్పటికీ వారి తీరు చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆ దేశం ఉత్పత్తులపై భారీగా సుంకాలు విధించాలని నిర్ణయించాం. చైనా ఉత్పత్తులపై 100 శాతం సుంకాన్ని విధిస్తున్నాం. నవంబర్ 1వ తేదీ నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయి' అని ట్రంప్ పేర్కొన్నారు.

# యశస్వి జైస్వాల్ రనౌట్



వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ యశస్వి జైస్వాల్ డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. ఢిల్లీ వేదికగా జరుగుతున్న టెస్టులో రెండో రోజు తొలి సెషన్‌లో అతను 175 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. ఫుల్ అండ్ ఆఫ్‌లో పడిన బంతిని జైస్వాల్ మిడాఫ్ దిశగా డ్రైవ్ చేశాడు. నాన్ స్ట్రయికర్ ఎండ్‌లో ఉన్న శుభమన్ గిల్ పరుగు కోసం ముందుకు రాలేదు. కానీ జైస్వాల్ మాత్రం సగం క్రీజ్ వరకు వెళ్లాడు. మళ్లీ క్రీజ్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించినా లాభం లేకుండాపోయింది. అయితే అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న చందర్‌పాల్ ఆ బంతిని అందుకుని కీపర్ దిశగా విసిరేశాడు. దీంతో అతను రనౌట్ అయ్యాడు. తాజా సమాచారం ప్రకారం భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 96 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 349 రన్స్ చేసింది. నితీశ్ 10, గిల్ 39 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు.



# శ్రీలీల లేటెస్ట్ లుక్

ఎప్పుడొచ్చాం అన్నది కాదన్నాయ్... బుల్లెట్ దిగిందా? లేదా? అని కాస్త మాస్‌గానే అంటున్నారు కిస్సిక్ బ్యూటీ శ్రీలీల. అందం ఉంది, మంచి పెర్ఫార్మర్ అనే పేరుంది.. స్పీడు స్టెప్పులకి, గ్లామర్ రోల్స్ కీ కేరాఫ్ అయ్యే కెపాసిటీ ఉంది.. ఇన్ని ఉన్నా ఉన్నట్టుండి ఆ మధ్య కెరీర్‌లో స్పీడు తగ్గించారు శ్రీలీల. మన దగ్గర ఇప్పటికీ మునుపటి స్పీడును అందుకోలేకపోతున్నారనే కంప్లయింట్ కూడా ఉందనుకోండి.. ఈ వైరల్ వయ్యారి మీద. కెరీర్ బిగినింగ్‌లో శ్రీలీల చూపించిన జోరును.. లాస్ట్ ఇయర్ మీనాక్షి చౌదరి అందుకున్నారు.


సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# పేదరికం కారణంగా పొలం పనులకు.. ఇప్పుడేమో వరల్డ్ కప్‌లో సంచలన బౌలర్






జాతీయ జట్టుకు ఆడాలనే కలను నిజం చేసుకున్న మరుఫా అక్తర్ 'టాక్ ఆఫ్ ది వరల్డ్ కప్'గా మారింది. లైన్‌అండ్ లెంగ్త్‌తో కూడిన బౌలింగ్, బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగల నేర్పు కలిగిన ఈ పేసర్‌ను బంగ్లా జట్టు తురుపుముక్కగా అభివర్ణిస్తున్నారు పలువురు. బంగ్లాదేశ్ మహిళా క్రికెట్‌లో మరుఫా లాంటి డేంజరస్ పేసర్‌ను ఇంతవరకూ చూడలేదని కెప్టెన్ నిగర్ సుల్తానా కితాబు.. మరుఫా వేసిన ఇన్‌స్వింగర్ ఈ ప్రపంచ కప్‌లో అత్యుత్తమం అని లసిత్ మలింగ ప్రశంసలు.. కెరీర్ ఆరంభంలోనే ఒక క్రికెటర్‌కు ఇంతటి గుర్తింపు రావడం చిన్నవిషయం కాదు. మరుఫాది ఉత్తర ప్రాంతలోని నిల్ఫమరి అనే మారుమూల గ్రామం. ఆమె తండ్రి ఐముల్లా హక్ భూమిని నమ్ముకున్న రైతు. పేదకుటుంబంలో పుట్టిన తను క్రికెటర్ అవ్వాలనుకుంది. కానీ, అది తమ శక్తికిమించినది అనే విషయం త్వరగానే అర్ధం చేసుకుంది మరుఫా. అయినా సరే టెన్నిస్ బంతులతో దగ్గర్లోని రైల్వే ట్రాక్ మైదానంలో బౌలింగ్ సాధన చేసేది. ఆమె ప్రతిభను గమనించిన సోదరుడు అల్ అమిన్ తనకు క్రికెట్ కిట్ కొనిచ్చాడు. అలా.. కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో తనకల వైపు అడుగులేసిన మరుఫా 15 ఏళ్లకు ఒక స్థానిక క్యాంపులో అదరగొట్టింది. దాంతో బంగ్లాదేశ్ క్రీడా శిక్ష కేంద్రంలో ఆమెకు చోటు దక్కింది. అక్కడితో తన లైఫ్ మలుపు తిరిగింది. అక్కడి కోచ్‌ల సలహాలతో తన నైపుణ్యాలను మెరుగుపరచుకున్న మరుఫా బంతిని రెండు వైపులా స్వింగ్ చేయండంలో మెరుగయ్యింది. అండర్ -19 టీ20 వరల్డ్ కప్‌లో బంగ్లా తరఫున అత్యధిక వికెట్లతో సీనియర్ జట్టు సెలెక్టర్ల దృష్టిలో పడింది. మూడేళ్ల క్రితం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేసింటీ స్పీడ్ ఎక్స్‌ప్రెస్. ఇప్పటివరకూ 29 వన్డేల్లో 25 వికెట్లు పడగొట్టింది. టీ20ల్లోనూ తన పేస్ పవర్ చూపిస్తూ 20 వికెట్లు తీసింటీ యంగ్‌స్టర్. నిరుడు వెస్టిండీస్ బ్యాటర్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన మరుఫా.. వికెట్ తీశాక బిగ్గరగా అరుస్తూ సంబురాలు చేసుకుంటుంది. అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు.. ఏడాదికోసారి వచ్చే ఈద్ పండక్కి కొత్త బట్టలు కొనుక్కోలేని దుస్థితి.. చిరిగిన దుస్తులను చూసి గ్రామస్థుల చీత్కారపు మాటలు.. మరొకరైతే కుంగిపోయేవారు. కానీ, మరుఫా అక్తర్ మాత్రం ఆ అవమానాలను, ఆర్థిక కష్టాలను తన విజయానికి సోపానాలుగా మార్చుకుంది. కష్టపడే తత్వంతో మెరుగవుతూ వచ్చిన మరుఫా.. పదమూడో సీజన్ వన్డే వరల్డ్ కప్‌లో నిప్పలు చెరుగుతోంది. కొత్త బంతితో పవర్ ప్లేలో వికెట్లు తీస్తూ బంగ్లాదేశ్‌కు శుభారంభాలు ఇస్తున్న 20 ఏళ్ల పేస్ గన్.. పాకిస్థాన్‌పై తొలి ఓవర్లోనే వరుస బంతుల్లో రెండు వికెట్లు తీసి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా ఓపెనర్ ఒమైమా సొహైల్‌ను ఇన్ స్వింగర్‌తో బౌల్డ్ చేసి దిగ్గజాల ప్రశంసలు అందుకుంటీ పేసర్. పాక్‌పై 2/31తో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. ఆ తర్వాతి గేమ్‌లో ఇంగ్లండ్‌పై రెండు వికెట్లతో హడలెత్తించింటీ స్పీడ్‌స్టర్. ఇంతకు ఈ యంగ్ సెన్సేషన్‌కు రోల్ మోడల్ ఎవరో తెలుసా.. మిచెల్ స్టార్క్ . ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ నాకు ఆదర్శం. అతడు బంతిని అద్భుతంగా స్వింగ్ చేస్తాడు.




## చరిత్ర సృష్టించిన జస్‌ప్రీత్ బుమ్రా

ఢిల్లీ వేదికగా ఇండియా , వెస్టిండీస్ ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్ లో భారత్ బ్యాటింగ్ లో అదరగొడుతుంది. జైస్వాల్, సాయి సుదర్శన్ అదిరిపోయే ప్రదర్శన్ ఇవ్వడంతో తొలి రోజు ఇండియా భారీ స్కోర్ చేసింది. ప్రస్తుతం క్రీజులో జైస్వాల్, కెప్టెన్ శుభ్ మన్ గిల్ ఉన్నారు. ఇది ఇలా ఉంటే..ఈ మ్యాచ్ ద్వారా టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అరుదైన రికార్డు సృష్టించాడు. అంతేకాక 93 ఏళ్లలో ఒక్కే ఒక్కడి బుమ్రా నిలిచాడు. శుక్రవారం వెస్టిండీస్‌తో ఢిల్లీ వేదికగా ప్రారంభమైన రెండో టెస్ట్‌తో బుమ్రా ఓ ఫీట్ సాధించాడు. 93 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే మూడు ఫార్మాట్లలో 50 మ్యాచ్‌లు ఆడిన ఏకైక ఇండియన్ పేసర్‌గా నిలిచాడు. వెస్టిండీస్ తో జరిగే రెండో టెస్టు బుమ్రాకు 50వ టెస్ట్ మ్యాచ్. బుమ్రా ఇప్పటి వరకు 75 టీ20లు, 89 వన్డేలు, 50 టెస్ట్‌లు ఆడాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన ఏడో టీమిండియా ప్లేయర్ గా బుమ్రా నిలిచాడు.

# రాష్ట్రవ్యాప్తంగా బంద్ పిలుపు.. ఆక్టోబర్ 14 ప్రధాన సమస్య ఏంటి?




తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్ల బీసీ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.తమపై తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 14వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ బంద్‌కు బీసీ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ బంద్ కారణంగా ఆ రోజు స్కూళ్లు, కాలేజీలు మూసివేసే అవకాశం ఉండడంతో విద్యార్థులకు అదనపు సెలవు లభించే సూచనలు కనిపిస్తున్నాయి.హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన బీసీ సంఘాల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్. కృష్ణయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం దురదృష్టకరమని, రాష్ట్రంలోని 56 శాతం బీసీ ప్రజల హక్కులను ఇది దెబ్బతీసిందని కృష్ణయ్య పేర్కొన్నారు."బీసీల ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి దెబ్బతీశారు. మా నోటికాడి అన్నం ముద్దను లాక్కున్నట్లుంది," అని ఆయన మండిపడ్డారు. హైకోర్టు ఇచ్చిన స్టే ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.బీసీ రిజర్వేషన్లను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైతే, రేవంత్ రెడ్డి దాని మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ పోరాటాన్ని మండల్ కమిషన్ ఉద్యమం తరహాలో ఉద్ధృతం చేస్తామని వెల్లడించారు.బీసీలలో ఇప్పుడు చైతన్యం వెల్లివిరుస్తోందని, ఊరూరా నిరసనలు, ధర్నాలు, రాస్తా రోకోలు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని బీసీ సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ 14న మిలియన్ మార్చ్ తరహా తెలంగాణ బంద్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఈ బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. "ఈ బంద్ రాష్ట్రాన్నే కాకుండా దేశాన్ని కదిలించేలా ఉంటుంది. బీసీల శక్తి ఏంటో చూపించే సమయం వచ్చింది,




## గురుకుల్ ఎస్‌బీడీపై ఫైనల్లో విజయం సాధించిన హారిజన్ క్రికెట్ అకాడమీ

గురువారం (09.10.2025) మ్యాచ్ ఉత్కంఠభరితంగా జరిగిన పోటీలో, హారిజన్ క్రికెట్ అకాడమీ గురుకుల్ SBDని ఓడించి ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. టాస్ గెలిచిన తర్వాత,మొదట బౌలింగ్ ఎంచుకున్న హారిజన్ బౌలర్ల మ్యాచ్‌లో నిప్పలు చెరిగారు. క్రమశిక్షణ కలిగిన బౌలింగ్ మరియు హారిజన్ పదునైన ఫీల్డింగ్ కారణంగా గురుకుల్ జట్టు 73 పరుగులకే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్ లో బాటింగ్ కు దిగిన హారిజన్ క్రికెట్ అకాడమీ 5 వికెట్లకు 75 పరుగులు చేసి, దృఢ సంకల్పంతో లక్ష్యాన్ని ఛేదించింది మరియు అర్హత కలిగిన విజయాన్ని నమోదు చేసింది.ఇది మొత్తం జట్టు నుండి అద్భుతమైన ఆల్ రౌండ్ ప్రదర్శన, జట్టుకృషి, ధైర్యం మరియు ఒత్తిడిలో ప్రశాంతతను ప్రదర్శించింది.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించిన తలసాని

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో తనపై వస్తున్న ఊహాగానాలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫుల్‌స్టాప్ పెట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో బంధుత్వం ఉన్నప్పటికీ, తన పూర్తి మద్దతు బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. బంధుత్వం వేరు, రాజకీయ అనుబంధం వేరని స్పష్టం చేస్తూ, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అన్ని ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి దివంగత మాగంటి గోపీనాథ్ అర్ధాంగి మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ బరిలో ఉన్నారు. అయితే, నవీన్ యాదవ్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు బంధువు కావడంతో, ఆయన మద్దతు ఎవరికి ఉంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ ప్రచారంపై సికింద్రాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తలసాని స్పష్టత ఇచ్చారు."నవీన్ యాదవ్‌తో నాకు బంధుత్వం ఉన్న మాట నిజమే. గతంలో అతనికి రాజకీయంగా కొన్ని సూచనలు కూడా ఇచ్చాను. కానీ, ఇప్పుడు పరిస్థితులు వేరు. నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నాను. అలాంటప్పుడు మా పార్టీ అభ్యర్థిని కాదని వేరే వారికి ఎలా మద్దతిస్తాను అని తలసాని ప్రశ్నించారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని ఆయన పునరుద్ఘాటించారు.పార్టీ కార్యక్రమాల్లో తాను చురుగ్గా పాల్గొంటున్నానని తలసాని గుర్తుచేశారు. ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా గురువారం కేటీఆర్‌తో కలిసి బస్ భవన్‌కు వెళ్లిన విషయాన్ని ప్రస్తావించారు.



# ఓటీటీ ఎంట్రీకి రెడీ అంటున్న పూజా హెగ్డే

ఒకప్పుడు టాలీవుడ్ లో మంచి డిమాండ్ ఇప్పుడు కోలీవుడ్ లో మంచి డిమాండ్ ఏర్పర్చుకున్న టాప్ స్టార్ హీరోయిన్స్ లో ఒకామెనే పూజా హెగ్డే. ఒకపక్క హీరోయిన్ గా సినిమాలు ఇంకోపక్క ఐటెం భామగా కూడా పలు సినిమాలు చేస్తూ మళ్ళీ బిజీగా మారిన ఆమె రీసెంట్ గానే "కూలీ" సినిమాలో సెన్సేషనల్ హిట్ సాంగ్ లో కనిపించింది. ఇక ఇదిలా ఉండగా పూజా హెగ్డేపై ఓ ఇంట్రెస్టింగ్ రూమర్ వినిపిస్తుంది. దీని ప్రకారం పూజా హెగ్డే తన ఓటిటి ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అయ్యినట్టు తెలుస్తుంది. పాపుల దిగ్గజ ఓటిటి సంస్థ నెట్ ఫ్లిక్స్ లో ఆమె ఓ క్రేజీ వెబ్ సిరీస్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఇప్పుడు టాక్. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది మరిన్ని డీటెయిల్స్ రావాల్సి ఉన్నాయి. ఇక హీరోయిన్ గా ప్రస్తుతం ఆమె జన నాయకుడు, కాంచన 4 తదితర సాలిడ్ ప్రాజెక్ట్ లలో ఆమె నటిస్తుంది.

## విజయ్ దేవరకొండ కొత్త సినిమా లాంఛనంగా ప్రారంభం



విజయ్ దేవరకొండ అభిమానులకు గుడ్ న్యూస్! 'కింగ్డమ్' మూవీ తర్వాత కొంత గ్యాప్ తీసుకున్న విజయ్ దేవరకొండ, తన తదుపరి సినిమాను లాంఛనంగా ప్రారంభించాడు. దిల్ రాజు నిర్మాణంలో, 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవి కిరణ్ కోలా దర్శకత్వంలో ఈ ప్రాజెక్ట్ తెరెకెక్కనుంది. మాస్ యాక్షన్, రూరల్ డ్రామా నేపథ్యంలో రూపొందనున్న ఈ చిత్రం ప్రారంభ వేడుక శనివారం హైదరాబాద్‌లో సైలెంట్‌గా జరిగింది.ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచే అంచనాలు నెలకొన్నాయి. "కత్తి నేనే.. నెత్తురు నాదే.. యుద్ధం నాతోనే.." అనే పంచ్ లైన్‌తో, కత్తి పట్టుకున్న రక్తంతో తడిచిన చేయి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఇప్పటికే విడుదల చేసి ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచారు. సినిమా రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో నడవనుందని విజయ్ గతంలో వెల్లడించాడు.

## హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న భట్టివిక్రమార్క



హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ప్రభుత్వ వేలంలో ఎకరం భూమి రూ. 177 కోట్లకు అమ్ముడుపోవడం నగర రియల్ ఎస్టేట్ రంగం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో తెలియజేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. హైటెక్స్‌లో జరిగిన తెలంగాణ నరెడ్కో ప్రాపర్టీ షోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ మహానగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ప్రతి సంవత్సరం పట్టణాభివృద్ధి ప్రణాళిక వ్యయంలో భాగంగా బడ్జెట్‌లో రూ. 10,000 కోట్లు కేటాయిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, తాగునీటి అవసరాల కోసం దాదాపు రూ. 13,000 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరే ఇతర నగరంలో లేని విధంగా హైదరాబాద్‌లో 24 గంటలు నాణ్యమైన విద్యుత్, మంచినీటి సరఫరా జరుగుతోందని ఆయన అన్నారు. భవిష్యత్తులో నగరంలో ఎలక్ట్రికల్ బస్సులే నడుస్తాయని ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపులు కల్పించినట్లు ఆయన వెల్లడించారు. రియల్టర్లు, బిల్డర్లను సంపద సృష్టికర్తలుగా రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందని ఆయన అన్నారు. వారి సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.